
సాక్షి విశాఖపట్నం
శుక్రవారం। 14। మార్చి। 2025

ఆకట్టుకున్న కిడ్నీ సైకత శిల్పం





అవయవదానంపై అవగాహన అవసరం

ప్రపంచ కిడ్నీ డే పురస్కరించుకుని జీవన్‌దాన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం బీచ్‌రోడ్డులో అవయవదాన అవగాహన నడక జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, జీవన్‌దాన్ రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ కె.రాంబాబు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి తదితరులు పాల్గొన్నారు.



సాగరతీరంలో.. సంప్రదాయ హోలీ

ఏయూక్యాంపస్: నగరంలో నివాసం ఉంటున్న మార్వాడీలు హోలీ వేడుకలను ముందుగానే ప్రారంభించారు. గురువారం ఉదయం ఆవు పేడతో చేసిన పిడకలను సముద్ర తీరానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ప్రతీ కుటుంబం నుంచి ఒక పిడకల దండను సేకరించి, వాటి తో సాగరతీరంలో పెద్ద కుప్పగా పేర్చారు. ఈ పిడకల కుప్పకు మహిళలు పూజలు చేశారు. గురువారం రాత్రి 11.34 గంటలకు పిడకలకు నిప్పు వెలిగించి హోలికా దహన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పిడకల నుంచి వచ్చి బూడిదను విభూతిగా భావించి ప్రతి ఇంటికి తీసుకెళ్లి పూజలు చేశారు. శుక్రవారం జరిగే వేడుకల్లో ఆ విభూతిని నుదుటన తిలకంగా ధరిస్తారు. ఆ తర్వాత మార్వాడీలందరూ కుటుంబ సమేతంగా హోలీ వేడుకల్లో పాల్గొంటారు.

న్యూస్‌రీల్

స్వచ్ఛ సర్వేక్షణ్, పీ-4 సర్వేపై ప్రత్యేక దృష్టి



డాబాగార్డెన్స్: స్వచ్ఛ సర్వేక్షణ్.. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జోనల్, వార్డు స్థాయి స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే బృందం కొద్ది రోజుల్లో సర్వే నిర్వహించనుందని, అందుకు తగిన పారామీటర్లలో లోపాలు గుర్తించి సవరించేలా చూడాలన్నారు. సచివాలయ పరిధిలో ప్రజలకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలపై వార్డు స్థాయి స్పెషల్ ఆఫీసర్లు నిత్యం పర్యవేక్షణ జరుపుతూ నేరుగా ప్రజలను కలిసి సంబంధిత విషయాలపై అడిగి, వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. నగరంలో జరుగుతున్న పి-4 సర్వేను 18లోగా పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులకు ప్రజలు గురికాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రేపు వినియోగదారుల హక్కులపై జాతీయ స్థాయి సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న వికాస్ పాండే

డాబాగార్డెన్స్: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 15న వినియోగదారుల చట్టం అమలుపై అవగాహన కల్పించడంతోపాటు జాతీయ స్థాయి శిక్షణా సదస్సు నిర్వహించనున్నట్లు కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ సదస్సులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు వినియోగదారుల హక్కుల మండలి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అసిస్టెంట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ మురళీనాథ్, చంద్రశేఖర్, ప్రసాద్‌రాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- చివరి తేదీ: ఏప్రిల్ 15
- ప్రవేశపరీక్ష: ఏప్రిల్ 30

మురళీనగర్: పదో తరగతి అనంతరం సాంకేతిక విద్యను అభ్యసించాలని అనుకుంటున్నారా? అయితే సిద్ధమైపోండి. పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు పాలిసెట్-2025 నోటిఫికేషన్‌ను రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ జి.గణేష్ కుమార్ విడుదల చేశారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు, ప్రస్తుతం పరీక్షలు రాస్తున్న వారు పాలిసెట్ రాయడానికి అర్హులని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ గురువారం ప్రారంభమైందని, ఏప్రిల్ 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు https://polycetap.nic. in/ ను సందర్శించాలన్నారు. దరఖాస్తు ప్రక్రియలో ఏమైనా సందేహాలు ఉంటే.. పాలిటెక్నిక్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. హెల్ప్‌లైన్ కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

1 నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

మురళీనగర్: పాలిసెట్-2025కు హాజరయ్యే విద్యార్థులకు సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఓ ప్రకటన విడుదల చేశారు. సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 10వ తరగతి పాసైన వారితో పాటు ప్రస్తుతం పది పరీక్షలు రాసే విద్యార్థులు చేరవచ్చని చెప్పారు. శిక్షణ కోసం ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బడిలో బలవంతపు తీర్మానాలు



రేషనలైజేషన్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసిన గోపాలపట్నం మండలం బుచ్చిరాజుపాలెం యూపీ స్కూల్

తుదిదశకు స్కూళ్ల పునర్నిర్మాణ ప్రక్రియ ● ప్రభుత్వ నిర్ణయానికి విశాఖలో 40.45 శాతం వ్యతిరేకత

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 85 శాతం ఓకేనట

మూతపడనున్న ప్రాథమిక పాఠశాలలు

అన్ని వర్గాల నుంచి తీవ్ర ఆందోళన

విశాఖ విద్య : ప్రభుత్వ పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియ తుదిదశకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన 117 జీవోను రద్దు చేసి... దానికి ప్రత్యామ్నాయంగా మోడల్ స్కూళ్లను తెరపైకి తీసుకొచ్చింది. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేసి, చుట్టు పక్కల పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఇందులో విలీనం చేసేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో దూరంగా వెళ్లే విద్యార్థులకు రవాణా చార్జీలు ఇస్తామని ప్రభుత్వం మభ్యపెడుతోంది. ప్రాథమిక విద్యకు విఘాతం కలిగేలా కూటమి ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయంపై విద్యావేత్తలు, ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో ప్రజాభిప్రాయ సేకరణ పేరిట స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఆమోదం పొందాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ క్షేత్రస్థాయిలో ఇది పారదర్శకంగా జరగడం లేదు. పాఠశాలల పునర్నిర్మాణంపై వ్యతిరేకత లేకుండా చూడాలనే కూటమి ప్రభుత్వం మౌఖిక ఆదేశాలతో దీనిపై నేరుగా జిల్లా కలెక్టర్లు రంగంలోకి దిగారు. దీంతో బడిలో బలవంతపు తీర్మానాలు జరిగిపోతున్నాయి.

మిగులు ఉపాధ్యాయుల దారెటో..

ప్రాథమిక పాఠశాలల్లో ఇప్పటి వరకు ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు (ఎస్జీటీ) పనిచేస్తున్నారు. విశాఖపట్నంలో 783 మంది, అనకాపల్లిలో 2,114 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,566 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. 3, 4, 5 తరగతులను మోడల్ స్కూళ్లకు తరలించినట్లయితే, ఆయా పాఠశాలల్లో ఇక ఒక్కరే ఉపాధ్యాయుడు పనిచేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన మూడు జిల్లాల్లో కలిపి ఆరు వందలకు పైగానే ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌గా ఉంటారు. రేషనలైజేషన్ పేరుతో వీరిలో ఎక్కువ మందిని అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి పంపించాల్సి ఉంటుంది. 117 జీవో అమల్లో భాగంగా జరిగిన రేషనలైజేషన్‌తో ఏజెన్సీకి వెళ్లిన ఉపాధ్యాయులు ఇప్పట్లో వెనక్కి వచ్చే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపడుతున్న చర్యలతో మిగులు ఉపాధ్యాయులు దారెటనేది ప్రశ్నార్థకమే.

గ్రామీణ ప్రాంతాల్లో విలీనానికి సై అంటున్నారా..?

కూటమి ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలకు మేలు చేకూర్చేలా నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ ఏడాది ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోయాయి. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు ఇంకా తగ్గిపోతాయని ఉపాధ్యాయులు బాహాటంగానే చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రస్తుత నిర్ణయాలతో చాలా స్కూళ్లలో 1, 2 తరగతుల నిర్వహణకు విద్యార్థులు లేక, స్కూళ్లకు తాళాలు వేయాల్సిందే. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో చాలా పాఠశాలలు మూతపడనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల నుంచి ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా తీర్మానాలు వస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. భవిష్యత్‌లో తమ బడి మూతపడుతుందనే విషయం వారికి తెలిసే, ఇదంతా జరుగుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

స్కూళ్ల పునర్నిర్మాణంపై అభిప్రాయ సేకరణ ఇలా..

జిల్లా	మండలాలు	పంచాయతీలు	ప్రభుత్వ స్కూళ్లు	అభిప్రాయ సేకరణ పూర్తయిన స్కూళ్లు	అభిప్రాయ సేకరణలో ఆమోదం శాతం
విశాఖపట్నం	11	161	560	440	81.63
అనకాపల్లి	24	667	1,408	1,159	84.85
అల్లూరి	22	421	1,673	1,587	98.02

మోడల్ స్కూళ్లపై అభిప్రాయ సేకరణ ఇలా..

జిల్లా	ప్రతిపాదిత మోడల్ స్కూళ్లు	ఎస్ఎంసీల నుంచి వచ్చిన వ్యతిరేకత శాతం
విశాఖపట్నం	178	40.45
అనకాపల్లి	180	15.53
అల్లూరి	252	15.88

పాఠశాలల పునర్నిర్మాణం ఇలా..

పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా ఇక నుంచి శాటిలైట్ స్కూళ్లు (పీపీ-1, పీపీ-2), ఫౌండేషన్ స్కూళ్లు (పీపీ-1, పీపీ-2, అలాగే 1, 2 తరగతులు), మోడల్ ప్రైమరీ స్కూళ్లు (పీపీ-1, పీపీ-2, అలాగే 1 నుంచి 5వ తరగతి వరకు), హైస్కూళ్లు (6 నుంచి 10 వరకు) ఉండేలా కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి, చుట్టుపక్కల పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను దానిలోకి తరలిస్తారు. 60 కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నట్లయితే దాన్ని యథావిధిగా కొనసాగిస్తారు. మిగతా స్కూళ్లలో కేవలం 1, 2 తరగతులు మాత్రమే నిర్వహించనున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు పూర్తిగా కనుమరుగైపోతాయి.



అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలో మూతపడనున్న కట్టువాని అగ్రహారం ప్రైమరీ స్కూల్

మూడు రోజుల్లో స్టాఫ్ నర్సుల తుది జాబితా

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీలో భాగంగా అభ్యర్థుల దరఖాస్తులపై వడపోత కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం చేపట్టింది. ఉత్తరాంధ్ర పరిధిలోని 6 జిల్లాల్లో 106 పోస్టులకు 8,300 మంది దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. జనవరి 27న అభ్యర్థుల ప్రావిజనల్ జాబితా విడుదల చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జాబితా పరిశీలన నిలిచిపోయింది. అభ్యర్థుల ప్రావిజనల్ జాబితా మీద 1,570 అభ్యంతరాలు వచ్చాయి. వీటితోపాటు అభ్యర్థుల దరఖాస్తులను అన్ని విధాలా పరిశీలించి మూడు రోజుల్లో ప్రావిజనల్ ఎంపిక జాబితాను విడుదల చేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి సాక్షికి గురువారం తెలిపారు. ఈ జాబితాపై కూడా అభ్యంతరాలకు మూడు రోజులు గడువిస్తామన్నారు. వాటిని పరిశీలించాకే తుది ఎంపిక జాబితాను రోస్టర్ మేరకు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

ఆయుష్మాన్ కార్డుకు నమోదు చేసుకోండి

ఏయూ క్యాంపస్: పీఎం జన్ ఆరోగ్య యోజన విస్తరణలో భాగంగా 70 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వయో వృద్ధులు ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలు పొందేందుకు ఆయుష్మాన్ వయో వందన కార్డును పొందవచ్చని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి తెలిపారు. ఇందుకు సమీపంలోని ఎంప్యానెల్డ్ ఆస్పత్రిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్వీయ రిజిస్ట్రేషన్ కోసం ఆయుష్మాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దీంతో పాటు www. beneficiary.nha.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. సమాచారం, మరిన్ని వివరాలకు కోసం టోల్ ఫ్రీ నంబర్ 14555కు ఫోన్ చేసి, 1800110770 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి తెలుసుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్), మాజీ సైనికుల సహకార ఆరోగ్య పథకం(ఈసీహెచ్ఎస్), ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్(సీఏపీఎఫ్) వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందుతున్న సీనియర్ సిటిజన్లు, వారి ప్రస్తుత పథకం లేదా పీఎం జన్ ఆరోగ్య యోజనను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ప్రైవేట్ ఆరోగ్య బీమా కవరేజీ పరిధిలోకి వచ్చే వ్యక్తులు, ఉద్యోగులు, రాష్ట్ర బీమా పథకం సభ్యులు కూడా ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

అప్పన్న పెళ్లిచూపులు నేడు

- కొండదిగువ ఉద్యాన మండపంలో డోలోత్సవం
- బొట్టినడిగే పున్నమి ఉత్సవంగా అడవివరం ప్రజల ఆచారం



అడవివరం గ్రామ దేవత పైడితల్లి

సింహాచలం: పాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం పెళ్లి చూపులు జరగనున్నాయి. స్వామి పెళ్లికుమారుడిగా ముస్తాబై సింహగిరి దిగి, కొండ దిగువ పుష్కరిణి సత్రంలో ఉన్న ఉద్యానమండపంలో కొలువుండి, డోలోత్సవం నిర్వహించుకోనున్నాడు. పెళ్లి నిశ్చయం అనంతరం అడవివరం గ్రామంలో తిరువీధి చేసుకోనున్నాడు. అనంతరం పైడితల్లి ఆలయం వద్దకు వెళ్లి, అక్కడి నుంచి మెట్లమార్గంలో కొండకి చేరుకుంటాడు.

డోలోత్సవం కథ ఇదీ..

సింహాచలేశుడికి ఏటా చైత్ర శుద్ధ ఏకాదశి రోజు వార్షిక కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. దీనికి ముందు వచ్చే పాల్గుణ పౌర్ణమి రోజున స్వామివారి పెళ్లిచూపుల తంతుతో డోలోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. దీన్నే అడవివరం గ్రామస్తులు బొట్టినడిగే పున్నమిగా చెప్తారు. అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని స్వామికి అక్కగా అభివర్ణిస్తుంటారు. పైడితల్లి అమ్మవారి కుమార్తెనే స్వామి మనువాడినట్లు చెప్తారు. సింహగిరిపై నుంచి కొండదిగువకు వచ్చిన స్వామి తొలుత తన సోదరి పైడితల్లి ఆలయం వద్దకు వెళ్లి పిల్లనివ్వాల్సిందిగా అమ్మవారిని అడగ్గా.. నీకు ఆస్తిపాస్తులేం ఉన్నాయని, ఏం చూసి పిల్లనివ్వాలని అమ్మవారు తొలుత ఒప్పుకోరు. దీంతో స్వామి అలిగి అక్కడి నుంచి వెళ్లి, పుష్కరిణి సత్రంలోని ఉద్యాన మండపంలో వేంచేస్తాడు. అక్కడ వైభవంగా డోలోత్సవం, వసంతోత్సవం, చూర్ణోత్సవం చేసుకుంటాడు. ఈ వేడుక గురించి తెలుసుకున్న పైడితల్లి అమ్మవారు స్వామికి ఎంతో మంది భక్తులు ఉన్నారని, వారే ఆయన ఆస్తిగా భావించి పిల్లనివ్వడానికి ఒప్పుకుంటుంది. స్వామికి పెళ్లి నిశ్చయమైన ఆనందంలో గ్రామస్తులు, భక్తులు, దేవస్థానం ఉద్యోగులు, వైదికులు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని వసంతోత్సవం జరుపుతారు. దీన్నే డోలోత్సవంగా అభివర్ణిస్తారు. డోలోత్సవం నిర్వహణ అనంతరం ఉగాది రోజున పెళ్లిరాట, చైత్రశుద్ధ ఏకాదశిన వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. డోలోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం ఈవో కె.సుబ్బారావు ఆధ్వర్యంలో వైదికులు,అధికారులు ఏర్పాట్లు చేశారు. కొండదిగువ ఉద్యానవనమండపాన్ని విశేషంగా ముస్తాబు చేశారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మధరావు శుక్రవారం విశాఖ వస్తున్నారు. మధ్యాహ్నం 1.50 గంటలకు విజయవాడ నుంచి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ చేరుకుని ప్రభుత్వ గెస్టు హౌస్‌లో బస చేస్తారు. అక్కడ నుంచి విజయనగరం వెళ్తారు. రాత్రి తిరిగి విశాఖ చేరుకుని బస చేస్తారు. 15న రాత్రి విమానంలో విజయవాడ వెళ్తారు.

డీఎస్సీ కోచింగ్‌కు వెబ్ ఆప్షన్లు

ఎంవీపీకాలనీ: డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు ఎంపికైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ లోపు https://jnanabhumi. ap.gov.in/ పోర్టల్ ద్వారా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సూచించింది. ఈ మేరకు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వైభవంగా అనంతుని రథోత్సవం





ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉభయ దేవేరులతో అనంత పద్మనాభస్వామి

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అనంత పద్మనాభ స్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా విశేష హోమం, గ్రామ బలిహరణం, మంగళాశాసనం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను వేద పండితులు వేద మంత్రోచ్ఛరణలు, నాద మునీశ్వరుల స్వరాల నడుమ రథంపైకి తోడ్కొని వచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రథం ముందు కుంభం(అన్నం) పోశారు. స్థానిక సీఐ సిహెచ్.శ్రీధర్ ప్రథమ పూజ అనంతరం గాలి గోపురం వద్ద నుంచి రథోత్సవం ప్రారంభమైంది. పూలమాలలు, అరటి చెట్లు, విద్యుద్దీపాలతో అలంకరించిన రథం భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముందుకు సాగింది. రాజ వీధి గుండా అనంత పద్మనాభ స్వామి రథచక్రాలు వడివడిగా ముందుకు కదిలాయి. ఈవో నానాజీ బాబు పర్యవేక్షణలో జరిగిన ఈ రథోత్సవంలో ఎంపీపీ రాంబాబు, పద్మనాభం సర్పంచ్ టి.పాప, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యథాతథస్థితి కొనసాగించండి

హయగ్రీవ భూములపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఎండాడలోని హయగ్రీవ భూముల స్వాధీనం విషయంలో నాలుగు వారాల పాటు యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు గురువారం అటు రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఇటు పిటిషనర్లను ఆదేశించింది. భూ కేటాయింపుల రద్దు విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాల తరువాతకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. తమ భూముల కేటాయింపులను రద్దుచేస్తూ విశాఖ జిల్లా కలెక్టర్ ఈనెల 10న జారీచేసిన ఉత్తర్వులను సవాలుచేస్తూ హయగ్రీవ ఫామ్స్ అండ్ డెవలపర్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలాగే, తనకు చెందిన 385 చదరపు గజాల స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రొసీడింగ్స్‌ను సవాలుచేస్తూ ఆ స్థల యజమాని ఐనంపూడి నాగేశ్వరరావు మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై గురువారం జస్టిస్ ధనశేఖర్ విచారణ జరిపారు. హయగ్రీవ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, నాగేశ్వరరావు తరఫున న్యాయవాది జవ్వాజి శరత్ చంద్ర వాదనలు వినిపించారు. హయగ్రీవ భూ కేటాయింపులపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో సీజే ధర్మాసనం ఆ భూముల విషయంలో నిర్ణయాధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టిందన్నారు. ధర్మాసనం ఆదేశాలకు విరుద్ధంగా కలెక్టర్ స్వాధీన ఉత్తర్వులిచ్చారని తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. భూ కేటాయింపు నిబంధనలను హయగ్రీవ ఉల్లంఘించిందని, అందుకే ఆ కేటాయింపులను రద్దు చేశామన్నారు. వాటిని రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించి మెమో ఇచ్చామని.. ఆ మేరకు ఉత్తర్వులు జారీచేయాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. ఇప్పటికే ఆ భూమిని స్వాధీనంలోకి తీసుకున్నామన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి భూముల స్వాధీనం విషయంలో నాలుగు వారాలపాటు యథాతథ స్థితిని కొనసాగించాలని ఇరుపక్షాలను ఆదేశించారు.

నేటి నుంచి జాతీయ ఆహ్వాన నాటిక ప్రదర్శనలు

మురళీనగర్: కేవీ మెమోరియల్ ఆర్ట్స్, విశాఖ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో మురళీనగర్‌లోని వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములపల్లి కళాక్షేత్రంలో జాతీయ స్థాయి ఆహ్వాన నాటకోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, పి.వెంకట సూర్యనారాయణరాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6.15 గంటలకు గుంటూరు అభినయ ఆర్ట్స్ వారిచే 'ఇంద్రప్రస్థం' నాటిక, రాత్రి 7.25 గంటలకు చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ వా రిచే 'మా ఇంట్లో మహాభారతం' నాటిక, రాత్రి 8.40 గంటలకు కొలకలూరు సాయి ఆర్ట్స్ వారిచే 'జనరల్ బోగీలు' నాటిక ప్రదర్శిస్తారు. శనివారం సాయంత్రం 6.15 గంటలకు ఒంగోలు పండు క్రియేషన్స్ వారిచే 'పక్కింటి మొగుడు' నాటిక, రాత్రి 8.15 గంటలకు విశాఖ జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ మహిళలచే 'సంకల్పం' నాటిక ప్రదర్శన ఉంటుంది. 16వ తేదీ ఆదివారం రాత్రి 7.25 గంటలకు విశాఖ శ్రీ సాయి కళానికేతన్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం వారిచే 'భక్త ప్రహ్లాద' పౌరాణిక నాటకం ప్రదర్శన ఉంటుంది.

ఫీజుల కోసం ఒత్తిడి చేస్తే కఠిన చర్యలు

విశాఖ విద్య: ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయన్న నెపంతో పదో తరగతి వార్షిక పరీక్షల హాల్ టికెట్ల జారీలో విద్యార్థులను ఒత్తిడికి గురిచేసే యాజమాన్యాలపై కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారాం హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫీజులకు సంబంధించి స్కూల్ యాజమాన్యాలు ఈ సమయంలో ఒత్తిడిని పెంచడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆన్‌లైన్‌లో హాల్ టికెట్ల జారీ ప్రక్రియ మొదలు పెట్టిందని, అదే హాల్ టికెట్లతో విద్యార్థులు పరీక్ష రాయవచ్చన్నారు. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే.. apscpcr2018 @gmail. comకు ఫిర్యాదు చేయవచ్చని సీతారాం కోరారు.

మానుపిల్లి కనువిందు



ఆరిలోవ: కై లాసగిరి హెల్త్ ఎరీనా వాకర్స్‌కు గురువారం ఓ మానుపిల్లి కనువిందు చేసింది. కైలాసగిరి కొండ అంచున ఉన్న హెల్త్ ఎరీనాకు రోజూ వందల మంది వాకింగ్‌కు వెళ్తుంటారు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో హనుమంతవాక మెట్ల మార్గం సమీపంలో దట్టమైన నల్లటి జుట్టు, పొడవైన తోకతో ఓ జంతువు కనిపించింది. అది చూడడానికి కొత్తగా కనిపించడంతో వాకర్స్ దాని దగ్గరకు వెళ్లేందుకు మొదట భయపడ్డారు. అది కదల్లేని పరిస్థితిలో ఉండటంతో కొంతసేపటి తర్వాత వాకర్స్ దాని దగ్గరకు చేరి సపర్యలు చేశారు. దీంతో ఆ జంతువు కోలుకుని తిరిగి కొండపై తుప్పల్లోకి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఆ జంతువు ఫొటోలను అటవీశాఖ సిబ్బందికి పంపించగా.. అది మానుపిల్లిగా వారు గుర్తించారు.

కష్టజీవులను కబళించిన టిప్పర్

- విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం
- ఇద్దరు దుర్మరణం.. ఒకరికి గాయాలు



రాంబాబు(ఫైల్)



జాతీయ రహదారిపై బంధువుల ఆందోళన

కూర్మన్నపాలెం : విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న ఇద్దరు కార్మికులను టిప్పర్ రూపంలో మృత్యువు కబళించింది. ఇరు కుటుంబాల్లో విషాదం నింపింది. స్టీల్ సిటీ డిపో ఎదురుగా జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దువ్వాడ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. దువ్వాడ ఉప్పర కాలనీకి చెందిన డి.రాంబాబు(45), నక్కా కృష్ణ(43), నక్కా శ్రీను స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి విధులకు హాజరయ్యారు. విధులు ముగించుకొని గురువారం ఉదయం ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. స్టీల్ సిటీ డిపో ఎదురుగా జాతీయ రహదారి వద్ద మలుపు తిరుగుతుండగా అనకాపల్లి నుంచి గాజువాక వైపు వస్తున్న టిప్పర్ బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో రాంబాబు, కృష్ణ చక్రాల కింద నలిగిపోయి దుర్మరణం పాలయ్యారు. బైక్‌పై వెనుక కూర్చున్న నక్కా శ్రీను ఎగిరి పడడంతో గాయాలతో బయటపడ్డాడు. ప్రస్తుతం అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాంబాబుకు భార్య చంటమ్మ, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కృష్ణకు భార్య సింహాచలంతో పాటు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఈ సమాచారం తెలియగానే కుటుంబ సభ్యులతో పాటు బంధువులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. గుండెలవిసేలా రోదించారు. కాగా.. ప్రమాదం జరిగే సమయంలో కూర్మన్నపాలెం నుంచి విజయనగరం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు మలుపు తిరుగుతోంది. దానిని కూడా టిప్పర్ ఢీకొని కొంత దూరం ఈడ్చుకు పోయింది. ఈ ఘటనలో బస్సు అద్దాలు పగిలిపోయాయి. అప్పుడే డిపో నుంచి బయలుదేరడంతో బస్సులో ప్రయాణికులెవరూ లేరు.

బంధువుల ఆందోళన

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని బంధువులు, కాలనీవాసులు ఘటనా స్థలం వద్ద ఆందోళనకు దిగారు. టిప్పర్ యజమాని ఘటనా స్థలానికి రావాలని, అంతవరకూ మృతదేహాలు తరలించడానికి వీలులేదని పట్టుబట్టారు. రోడ్డుపైనే బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి, వాహనాలు నిలిచిపోయాయి.

ట్రాఫిక్ ఏడీసీపీ కె.ప్రవీణ్‌కుమార్ అక్కడకు చేరుకుని, వాహనాలను దారి మళ్లించారు. మధ్యాహ్నం వరకు ఆందోళన కొనసాగించడంతో.. పోలీసులు టిప్పర్ యాజమాన్య ప్రతినిధులను రప్పించి పోలీస్‌స్టేషన్‌లోనే చర్చలు జరిపారు. ఏసీపీ టి.త్రినాథ్ సమక్షంలో జరిగిన ఈ చర్చల్లో సవర సంఘం ప్రతినిధులు జి.రాజేష్, నూకరాజు, తాతారావు యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వడానికి ఒప్పందం కుదరడంతో బంధువులు ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. టిప్పర్ డ్రైవర్‌ను అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు. సీఐ మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట

- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తోందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ శాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్ష చేశారు. ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలు కాగా.. అదనంగా ఎస్సీలకు రూ.50 వేలు, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పీఎంఏవై అర్బన్, గ్రామీణ కింద ఒకటి, రెండు ఆప్షన్లలో 24,696 గృహాలు నిర్మాణంలో ఉన్నాయని, వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించి 8,619 మంది లబ్ధిదారులకు రూ.43.40 కోట్ల అదనపు సాయం అందుతుందన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు లబ్ధిదారులకు అవగాహన కల్పించి, వారి వివరాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలో మే నెలాఖరు నాటికి 7,750 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. అయితే ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు పెద్దపీట వేసి పనులు సాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, డీఈలు సూర్యారావు, నారాయణ ప్రసాద్, ఏడీసీలు రమణమూర్తి, వర్మ, సోమనారాయణ, యూసీడీ పీడీ సత్యవేణి, డీసీవో ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

కొమ్మాది : రుషికొండ బీచ్‌లో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ చేస్తున్న అభివృద్ధి పనులను గురువారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పరిశీలించారు. ఇక్కడ చేస్తున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ నిర్మిస్తున్న మెట్ల మార్గం, ఫుట్‌పాత్ పనులు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరలో బ్లూ ఫ్లాగ్ బృందం ఈ బీచ్‌ను సందర్శించనున్న నేపథ్యంలో సాధ్యమైనంత వరకు అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా టూరిజం అధికారి సుధాసాగర్, రీజనల్ డైరెక్టర్ జగదీష్, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, రెవెన్యూ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన అవసరం

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఏయూక్యాంపస్: అవయవదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించి, అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రపంచ కిడ్నీ డే పురస్కరించుకుని జీవన్‌దాన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం బీచ్‌రోడ్డులో అవయవదాన అవగాహన నడక జరిగింది. ఈ సందర్భంగా కాళీమాత ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఎక్కువగా కూర్చోవడం, మూత్ర విసర్జనకు సకాలంలో వెళ్లకపోవడం వంటివి మానుకోవాలని హితవు పలికారు. దీర్ఘ కాలంలో ఇవి సమస్యలకు కారణాలుగా మారుతాయన్నారు. మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గతేడాది 210 మందికి అవయవాలు మార్పిడి చేశారని, ప్రస్తుతం జిల్లాలో 4,312 మంది అవయవాల కోసం నమోదు చేసుకున్నట్లు తెలిపారు. జీవనశైలిలో మార్పులతోనే చక్కని ఆరోగ్యం సాధ్యమని సూచించారు. సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ఇటీవల కాలంలో కిడ్నీ సంబంధ వ్యాధులు పెరగడం ఆందోళనకరమన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి దానం చేసే అవయవాలు మరొక ఎనిమంది మందికి ప్రాణదానంగా నిలుస్తాయన్నారు. అవయవదానంపై ప్రతీ ఆస్పత్రి బయట ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. జీవన్‌దాన్ రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ కిడ్నీ ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని, ఆరోగ్యకరమైన అలవాట్లు, జీవనశైలిని కలిగి ఉండాలన్నారు. రెండున్నర నెలల కాలంలో 54 అవయవాలు మార్పిడి చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైద్య, నర్సింగ్ విద్యార్థులు, వివిధ ఆస్పత్రుల సిబ్బందితో కలిసి కలెక్టర్, సీపీ తదితరులు నడిచారు.

భూముల క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ

- విశాఖ, భీమిలి డివిజన్ల రెవెన్యూ సమీక్షలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం



రెవెన్యూ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: అభ్యంతరం లేని అనధికారిక ఆక్రమణలు, నివాసయోగ్యమైన కట్టడాల క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఇటీవల తీసుకొచ్చిన జీవో నంబర్ 30 ఉద్దేశాలు, ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. 2019కి ముందు జరిగిన ఆక్రమణలను పరిగణలోకి తీసుకుని క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో గురువారం వేర్వేరుగా విశాఖ, భీమిలి రెవెన్యూ డివిజన్లపై సమీక్ష జరిగింది. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, సర్వే శాఖ ఏడీ సూర్యారావులతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులు, పీజీఆర్ఎస్ వేదికగా వచ్చిన వినతుల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. ప్రజల సంతృప్తే కొలమానంగా రెవెన్యూ సిబ్బంది పనితీరును అంచనా వేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. రీ సర్వే, మ్యుటేషన్ల ప్రక్రియలో పారదర్శకత లోపించకుండా పని చేయాలన్నారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఏప్రిల్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని, ఆక్రమణల వివరాలను ప్రతి సచివాలయంలో ప్రదర్శించాలని ఆదేశించారు. జీవో నంబర్ 301 ప్రకారం గాజువాక పరిధిలోని భూముల క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో తహసీల్దార్లు, డీటీలు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

గీతాకృష్ణ వ్యాఖ్యలపై మహిళా న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సీతమ్మధార: మహిళలపై టాలీవుడ్ దర్శకుడు గీతా కృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలను వుమెన్స్ అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్(వావా) అధ్యక్షురాలు పప్పు అనురాధ ఖండించారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వావా ఆధ్వర్యంలో గురువారం మహిళా న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గీతాకృష్ణ వివిధ చానల్స్‌లో మహిళలను అసభ్యకరంగా వర్ణిస్తూ వ్యాఖ్యలు చేయడంపై అభ్యంతరం తెలిపారు. ఆయన వ్యాఖ్యలు మహిళల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. అసోసియేషన్ తరఫున అతనిపై పోలీస్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామని, ఆయన మాట్లాడిన వీడియోలు ఆధారంగా గీతాకృష్ణపై చర్యలు తీసుకోవాలని అనురాధ కోరారు. నిరసనలో అసోసియేషన్ కార్యదర్శి హేమమాలిని, కోశాధికారి బి.రమాదేవి, ఉపాధ్యక్షురాలు కె.లక్ష్మీదుర్గ, డి.పద్మారాణి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

మహారాణిపేట: ఈ నెల 16లోగా తమ సమస్యలను పరిష్కరించకపోతే డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన ఉధృతం చేయనున్నట్లు ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ గోవింద గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. చర్చలు విఫలం కావడంతో ఈ మేరకు నిర్ణం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్, ఏపీ వైద్య సేవ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు ప్రభుత్వానికి తమ భవిష్యత్ కార్యాచరణపై నోటీసు అందించినట్లు తెలిపారు. మార్చి నెలలో రానున్న మూడు సోమవారాలు విధులు బహిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. 27న మంగళగిరిలో ఉన్న ట్రస్టు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోందని, ఆప్కాస్ రద్దు దిశగా ఇప్పటికే అడుగులు వేసిందన్నారు. అరకొర జీతాలతో 17 ఏళ్లుగా నెట్టుకొస్తున్న తమ బతుకులతో ప్రభుత్వం ఆడుకోవడం సరి కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



పోటీలకు ఎంపికైన జిల్లా పురుషుల జట్టు

ఎంవీపీకాలనీ : రాష్ట్ర స్థాయి పోటీలకు విశాఖ జిల్లా బాలురు, బాలికలు జట్లను ఎంపిక చేసినట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాద రెడ్డి తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేడ్ స్పోర్ట్స్ అకాడమిలో జరగనున్న 34వ రాష్ట్ర సబ్ జూనియర్ బాలురు, బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. గత వారం రోజులుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో బాలురు, బాలికల జట్లుకు శిక్షణ అందించినట్లు తెలిపారు. బాలురు జట్టుకు మేనేజర్‌గా ఎం.శివ, కోచ్‌గా కె.జయ వ్యవహరించనుండగా ప్రదీప్, దుర్గాప్రసాద్, శ్రీను, సంపత్, సందీప్, ప్రసాద్, మణికంఠ, కార్తీక్, హేమంత్, హేమసతీష్, శ్రీను, హేమసుందర్ సభ్యులుగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. మహిళల జట్టుకు కోచ్‌గా చైతన్య వ్యవహరిస్తుండగా ద్రాక్ష, మేఘన, పుణ్యమ, జానకి, కుసుమ, ప్రణీత, హారిక, అనురాధ, సౌమ్య, అక్షయ, కావ్య, పావని ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన ఆయా జట్ల క్రీడాకారులకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రసాదరెడ్డితో పాటు జాయింట్ సెక్రటరీ సిహెచ్ గోవిందు, కోశాధికారిగా లక్ష్మణరావు, జాతీయ క్రీడాకారులు వై.వి.శ్రీనివాస్, వి.కనకరాజు అభినందనలు తెలిపారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు స్టేషన్ల నుంచి ఆయా తేదీల్లో పలు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- చర్లపల్లి–నహర్‌లగున్(07046) స్పెషల్ ఈ నెల 15, 22, 29వ తేదీల్లో (ఆదివారం) చర్లపల్లిలో ఉదయం 8.40 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9.13 గంటలకు దువ్వాడకు, సోమవారం సాయంత్రం 4గంటలకు నహర్‌లగున్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నహర్‌లగున్–చర్లపల్లి(07047) స్పెషల్ ఈ నెల 18, 25, ఏప్రిల్ 1వ తేదీల్లో (మంగళవారం) నహర్‌లగున్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు బయల్దేరి గురువారం ఉదయం 6.20 గంటలకు దువ్వాడకు అదేరోజు రాత్రి 9.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.
- విశాఖపట్నం–షాలిమర్(08577) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16వ తేదీ ఉదయం 11.20 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటిరోజు(బుధవారం) తెల్లవారు 3 గంటలకు షాలిమర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో షాలిమర్– విశాఖపట్నం (08578) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేదీ ఉదయం 5 గంటలకు షాలిమర్‌లో బయల్దేరి అదే రోజు రాత్రి 8.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం–చర్లపల్లి(08579) స్పెషల్ ఈ నెల 16వ తేదీ రాత్రి 6.20 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చర్లపల్లి–విశాఖపట్నం(08580) స్పెషల్ ఈ నెల 17వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి అదే రోజు రాత్రి 10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

కలెక్టరేట్‌లో ఘనంగా మొల్లమాంబ జయంతి



మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: కవయిత్రి, మొల్ల రామాయణం రచయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు గురువారం కలెక్టరేట్‌లో జరిగాయి. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు. మొల్ల రచనా శైలి సరళమైనదని, ఆమె జీవితం అనుసరణీయమైనదని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి బి.శ్రీదేవి, కుమ్మరి శాలివాహన సంఘం డైరెక్టర్ చిరంజీవులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా భోజన శాల

- అసంతృప్తి వ్యక్తం చేసిన ఏయూ వీసీ
- క్యాంపస్ హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో కలసి టిఫిన్ చేస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్ హాస్టళ్లను గురువారం ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల హాస్టళ్లలో భోజనం సరిగా పెట్టడం లేదని, ఇతర సమస్యలపై బుధవారం రాత్రి విద్యార్థులు ఖాళీ కంచాలతో ఏయూ ప్రధాన గేటు ముందు ధర్నా చేపట్టడంతో అధికారుల్లో చలనం వచ్చింది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఆచార్య రాజశేఖర్ హాస్టళ్లను పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాల భోజన శాలలో అపరిశుభ్ర వాతావరణం ఉండటం గమనించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలసి అక్కడే అల్పాహారం తీసుకున్నారు. భోజన నాణ్యత, మెనూ అమలు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వాష్ బేసిన్‌కు వెళ్లే మార్గాన్ని తరచూ శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనశాలలో కుర్చీలు కొన్ని చోట్ల విరిగి ఉండటాన్ని గమనించి, వెంటనే మార్పు చేయాలన్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను మెరుగుపరచడంలో, పర్యవేక్షణలో విద్యార్థులను భాగస్వాములు చేస్తామని, ఇందుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని వీసీ స్పష్టం చేశారు. హాస్టల్ మెస్‌లపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని విద్యార్థులకు హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజన సమయంలో వీసీ మరో మెస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, భోజన నాణ్యతను పరిశీలించారు. సాయంత్రం అకడమిక్ సెనేట్ మందిరంలో విద్యార్థులతో సమావేశమయ్యారు. హాస్టల్లో ఉన్న సమస్యలపై సమగ్ర వివరాలు తీసుకున్నారు. అలాగే ఆంధ్ర విశ్వవిద్యాలయం డిస్పెన్సరీని తనిఖీ చేసి, అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు.

లాభాల కోసం పర్యావరణాన్ని ధ్వంసం చేస్తారా.?

- సీఆర్‌జెడ్ నిబంధనల సడలింపుపై ప్రభుత్వ వైఖరి సరికాదు
- ధ్వజమెత్తిన మానవ హక్కుల వేదిక

సాక్షి, విశాఖపట్నం: పర్యాటక రంగంలో లాభాలు ఆర్జించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణానికి విఘాతం కలిగించేందుకు అడుగులు వేయడం గర్హనీయమని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కె.సుధ, తెలుగు రాష్ట్రాల కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ వి.ఎస్.కృష్ణ ధ్వజమెత్తారు. సీఆర్‌జెడ్ నిబంధనల సడలింపుల కోసం ప్రయత్నిస్తున్నట్లు టూరిజం మంత్రి కందుల దుర్గేష్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మానవ హక్కుల వేదిక ప్రతినిధులు ప్రకటన విడుదల చేశారు. 1991లో వచ్చిన సీఆర్‌జెడ్ నిబంధనలను ఇప్పటికే 48 సార్లు సవరించారన్నారు. తమ లాభాల కోసం సముద్ర పర్యావరణాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించడం సరికాదని పేర్కొన్నారు. సీఆర్‌జెడ్ నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించాలే తప్ప.. వాటిని విచ్ఛిన్నం చేసేందుకు చూడకూడదని హితవు పలికారు. రియల్టర్లు, వాణిజ్యవేత్తలు, పర్యాటక ప్రాజెక్టు సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు నిబంధనలు సవరిస్తామంటూ మంత్రి చేసిన వ్యాఖ్యలు తక్షణమే వెనక్కి తీసుకోవాలని మానవ హక్కుల వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు.

జపాన్ దేశస్తుడికి సెల్ ఫోన్ అప్పగింత



షిషిడాకు సెల్‌ఫోన్ అప్పగిస్తున్న భీమిలి క్రైం ఎస్ఐ సూర్యప్రకాశ్

భీమునిపట్నం: సైకిల్‌పై ప్రపంచ యాత్ర చేస్తున్న జపాన్ దేశస్తుడు గురువారం తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా క్రైం పోలీసులు వెతికి అతనికి అప్పగించారు. వివరాలివి. జపాన్‌కు చెందిన తొషియుకి షిషిడా తన యాత్రలో భాగంగా ఒడిశా నుంచి హైవేపై విశాఖపట్నం వస్తున్నారు. అయితే తగరపువలస సమీపంలోకి వచ్చేసరికి తన సెల్‌ఫోన్ పోయిన విషయాన్ని గుర్తించారు. వెంటనే అతను భీమిలి క్రైం స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ సూర్యప్రకాశ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన సాంకేతిక పరిజ్ఞానంతో సెల్ ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. అయితే అది జాతీయ రహదారిపై భోగాపురం పరిధిలోని మహరాజుపేట వద్ద ఉంది. ఆ ప్రాంతం తమ పరిధిలోనిది కానప్పటికీ ఎస్ఐ సూర్యప్రకాశ్, కానిస్టేబుల్ రాజేష్‌తో అక్కడకు వెళ్లి సెల్‌ఫోన్‌ను సేకరించారు. అనంతరం జపాన్ దేశస్తుడికి అందజేశారు. ఫిర్యాదు అందిన గంట వ్యవధిలోనే ఫోన్‌ను వెతికి అప్పగించిన పోలీసులకు షిషిడా ధన్యవాదాలు తెలిపారు.